## సిపిఐ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలి



**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిధిలోని తనికెళ్లలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థిని గడల కళావతి తరుపున సిపిఐ జాతీయ సమితి సబ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి గురువారం ప్రచారంలో పాల్గొన్నారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతు తనికెళ్లలో సిపిఐ అభ్యర్థిని అఖండ మెజార్టీతో

మిగతా 2లో..

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 05 | డిసెంబర్ | 2025 పేజీలు : 8

# ప్రలోభాల పాపం ఎవరిది...?




**-డబ్బు, మద్యం పంపిణీతో ప్రలోభాల ఎర**
**-పెట్టుబడి లాభం పొందికలా రాజకీయాలు**
**-విలువలు గల రాజకీయాలకు పాతర**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల తీరు మారింది. ప్రజాభిప్రాయం కన్నా ఎన్నికల్లో ధనం, మద్యం పంపిణీయే ఫలితాన్ని శాసిస్తుంది. ప్రలోబాల వలలో చిక్కుకున్న ఓటర్ల మంచి, చెడు, అభివృద్ధి, భవిష్యత్తు ఆలోచించే స్థితిలో లేరు. ఈ పాపం ఎవరిది...? అక్రమ మార్గాల్లో పెద్ద మొత్తంలో సంపాదించి కోట్లు కొల్లగొట్టి ఎన్నికల వేళ ఖర్చు చేసి గెలిచే వారిదా, విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ బహిరంగంగానే నోట్లు పంచుతూ ఓటర్లను సంతలో పశువుల్లా టోకున, రిటైల్‌గా కొనుగోలు చేస్తున్న వారిదా...? ప్రజలకు అందుబాటులో ఉండటం సేవాతత్పరత, నిజాయితీ , అభివృద్ధి ఇవేవి ఆలోచించకుండా ఒక్కరోజు ప్రలోభానికి లొంగిపోయి ఓట్లు వేస్తున్న ఓటర్లదా ఎవరిది అన్న ప్రశ్నకు సరైన సమాధానం దొరకని స్థితి. డబ్బులున్నాయి పదవి కావాలి కాబట్టి కొనుగోలు చేసి గెలుస్తాం. ఓట్లను ఉచితంగా అడగటం లేదుగా అయినా మా గురించి తెలిసే గెలిపిస్తున్నారుగా అన్న రాజకీయ వ్యాపారుల ప్రశ్నకు సమాధానం దొరకదు. అసమర్థుడు, అవినీతి పరుడు అని తెలిసి చిన్న మొత్తాన్ని పుచ్చుకుని పెద్ద తప్పు చేస్తున్న ఓటర్ల నుంచే మార్పు రావాలి. ఎన్నికల వేళ ఐదేండ్ల భవిష్యత్‌ను ఆలోచించాలి. అధికార యంత్రాంగం ప్రలోబాల గురించి పట్టించుకునే స్థితిలో లేదు. ఖర్చుకు నిబంధన, పరిమితి అన్న పదాలు అపహాస్యం అవుతున్నాయి. మూడు నుంచి నాలుగు వందల ఓట్లున్న గ్రామ పంచాయతీలలో రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల ఖర్చు చేస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో ఆలోచించవచ్చు. 2019 పంచాయతీ

మిగతా 2లో..

## మసకబారుతున్న పోలీస్ ప్రతిష్ట





**-హత్య కేసును ఛేదించడంలో జాప్యం**
**-నిందితుల కోసం అన్వేషణ**
**-కొలిక్కి రాని దర్యాప్తు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పోలీస్ శాఖ గత కొన్నేళ్లుగా అత్యంత సమర్ధవంతంగా పనిచేస్తూ నేరాలను అరికట్టడంలోనూ, శాంతి భద్రతలను కాపాడటంలోనూ ప్రశంసలు పొందుతుంది. ముఖ్యంగా అసాంఘిక శక్తుల ఆటకట్టించడం, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ప్రత్యేక దృష్టిసారించి కట్టడి చేయడంలోనూ మంచి ఫలితాలను సాధించింది. కానీ నెల రోజులుగా ఖమ్మం పోలీస్ శాఖపై వస్తున్న విమర్శలు, ఆరోపణలు ఆ శాఖ ప్రతిష్టతను మసకబారుస్తున్నాయి. అక్టోబర్ 31న సిపిఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్య కేసు తర్వాత దర్యాప్తులో జరుగుతున్న జాప్యం, సిపిఎం ఆందోళనలు, ఆరోపణలు పోలీస్ శాఖ వైపు వేలెత్తి చూపేలా చేస్తున్నాయి. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సామినేని రామారావును గుర్తు తెలియని వ్యక్తులు ఆయన ఇంటి వద్ద తెల్లవారుజామునే హత్య చేశారు. హత్య జరిగిన తర్వాత దీనిని సుపారీ హత్యగా భావించారు. పోలీసులు సైతం ప్రాథమికంగా ఈ విషయాన్నే ధృవీకరించారు. ఇదే సమయంలో సామినేని రామారావు సతీమణి స్వరాజ్యం పాతర్లపాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేసింది. అక్కడి నుంచి మొదలైన దర్యాప్తు ఇంత వరకు ఒక కొలిక్కి

మిగతా 2లో..

## నిబంధనలకు విరుద్ధంగా నియామకం

**-జిల్లా ఉద్యోగుల్లో విస్తృత చర్చ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఒక అధికారి నియమాకం ఇప్పుడు జిల్లా ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అనర్హులకు అవకాశం కల్పించారని ఉద్యోగ వర్గాలు వాపోతున్నాయి. అధికార పార్టీ ప్రమేయంతో ఈ నియమాకం జరిగిందని ఇది తాత్కాలిక నియమాకమే అయినా ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధమన్న ప్రచారం జరుగుతుంది. వివరాల్లోకి వెళితే... జిల్లా సంక్షేమ అధికారిగా గతంలో రాంగోపాల్ రెడ్డి పని చేశారు. ఆయన వికలాంగుల శాఖ నుంచి జిల్లా సంక్షేమ అధికారిగా నియమితులయ్యారు. ఇటీవల స్త్రీ శిశు సంక్షేమం, వికలాంగుల వయో వృద్ధులకు సంబంధించిన శాఖలను విలీనం చేయడంతో వికలాంగుల శాఖలో పని చేస్తున్న రాంగోపాల్‌రెడ్డిని సంక్షేమ అధికారిగా నియమించారు. వ్యక్తిగత కారణాలు ఇతరత్రా వ్యవహారాలతో ఆయన హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. జిల్లా సంక్షేమ అధికారి నియమాకానికి సంబంధించి పైన పేర్కొన్న మూడు శాఖల్లో ఉన్న సీనియర్ అధికారిని నియమించాల్సి ఉండగా తద్ విరుద్ధంగా వేరే శాఖలో పని చేస్తున్న వారిని సంక్షేమ అధికారిగా నియమించారని తెలుస్తున్నది. ఖమ్మం జిల్లాలో ఐసిడిఎస్‌కు సంబంధించి ఏడు ప్రాజెక్టులు ఉన్నాయి. వీటిలో సీనియర్ గెజిటెడ్ అధికారులు పని చేస్తున్నారు. వీరందరిని కాదని నాన్ గెజిటెడ్ ఉద్యోగికి జిల్లా సంక్షేమ అధికారి బాధ్యతను అప్పగించడం పట్ల ఉద్యోగుల్లో భిన్న స్వరాలు



వినపడుతున్నాయి. తెలిసి జరిగినా తెలియక జరిగినా ఈ తప్పిదాన్ని సరి చేయాల్సిన బాధ్యత అటు ప్రజాప్రతినిధులు ఇటు ఉన్నతాధికారులపై ఉంది. ఇప్పటికే జిల్లా సంక్షేమ శాఖకు చెందిన పలువురు వేదనకు గురవుతున్నప్పటికీ ఒకవేళ రాజకీయ ఒత్తిడితో ప్రస్తుత ఇంచార్జినే కొనసాగిస్తే తమకు వేధింపులు తప్పవన్న ఆందోళనతో ఫిర్యాదు చేసేందుకు జంకుతున్నారు. ప్రస్తుతం నియమించిన అధికారి సమర్థత విషయంలోనూ లేదా ఇతరత్రా విమర్శలు లేకపోయినా నియమాకం మాత్రం నిబంధనలకు విరుద్ధమన్న భావన ఉద్యోగుల్లో సర్వత్రా వ్యక్తమవుతుంది.

# ప్రలోభాల పాపం ఎవరిది...?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో 470 ఓట్లున్న గ్రామ పంచాయతీలో ముగ్గురు అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీ పడి ఒకరు ఎక్కువో, తక్కువో రూ. 60 లక్షలు ఖర్చు చేశారు. చివరకు 168 ఓట్లు వచ్చిన అభ్యర్థి విజయం సాధించగా 470 ఓట్లు ఉన్న పంచాయతీ అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం నుండి వచ్చింది 20 లక్షల లోపే. అయినా ఇంతగా ఎందుకు ఖర్చు చేస్తున్నారంటే ఇతరత్రా సంపాదనలకు సర్పంచ్ పదవి అదనపు అర్హతగా రాజకీయ నేతలు ప్రజాప్రతినిధుల వద్ద పైరవిలకు రాస్తాగా ఉపయోగపడుతుందని భావించి ఖర్చు చేస్తున్నారు. ఇప్పుడు రాజకీయాల్లో పెట్టుబడి , లాభాలు అన్న ఆలోచనతోనే సాగుతున్నాయి. ఎంత పెట్టుబడి పెడితే పదవి వస్తుంది, ఆ తర్వాత పెట్టిన పెట్టుబడి ఎలా తిరిగి వస్తుంది, పెట్టుబడి పోనూ లాభం సంగతేమిటి అన్న ఆలోచనతోనే ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఈ విషయంలో సర్పంచ్ మొదలు ఎంఎల్‌వ, ఎంపిల వరకు ఇదే ఆలోచన. సామాన్యులు సేవాతత్పరులు, అభివృద్ధి కాముకులు ఇక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కనిపించడం లేదు. ఒకవేళ ధైర్యం చేసి సేవ చేశాం, నిజాయితీగా ఉన్నాం గెలిపిస్తారులే అనుకుని పోటీ పడితే డిపాజిట్లు గల్లంతవుతున్నాయి. విలువ గలిగిన రాజకీయాలకు దాదాపు పాతరపడింది. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల కోలాహలం నడుస్తుంది. నామినేషన్ నాటి నుంచే మద్యం పంపిణీ మొదలైంది. ఓటర్లను తమ వైపుకు తిప్పుకునేందుకు విపరీతంగా మద్యం పంపిణీ చేస్తున్నారు. ఎన్నికలు సమీపించే కొద్దీ ప్రలోభాలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిస్థితులలో జరిగే ఎన్నికలు ప్రజాభిప్రాయాన్ని ప్రతిఫలించ లేవు. ఎవరు ఎక్కువ ప్రలోభాలకు గురి చేస్తే వారికి గెలుపు దక్కుతుండడంతో బరిలో నిలిచిన వారు ఖర్చు చేయడం పైనే దృష్టి సారించారు. ఎన్నికలు ఈ పరిస్థితికి రావడానికి కారణం అధికార యంత్రాంగమో, ప్రజలో, బరిలో నిలిచి విచ్చల విడిగా ఖర్చు చేస్తున్న వారో ఎవరిదో కానీ ఈ దుస్థితికి ముగింపు పలకాలి. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నీతి, నిజాయితీతో పని చేసే వారిని గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పల్లెల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, సంక్షేమం, అభివృద్ధి తదితర విషయాలను దృష్టిలో ఉంచుకుని విజ్ఞతతో ఆలోచించి ఓటు వేస్తే రానున్న ఐదేండ్లలో గ్రామాభివృద్ధి, పల్లె ప్రశాంతత వెల్లివిరుస్తుంది.



# మసకబారుతున్న పోలీస్ ప్రతిష్ట

(మొదటి పేజీ తరువాయి)

రాలేదు. పోలీస్ అధికారులు ఇది రాజకీయ హత్య కాదు అని హత్య జరిగిన కొన్ని గంటల్లోనే ప్రకటించారని రాజకీయ హత్య కాదని పోలీసులు గంటాపదంగా చెబుతున్నప్పుడు ఎవరు హత్య చేశారో తేల్చడంలో జాప్యమెందుకని సిపిఎం ప్రశ్నిస్తుంది. రాజకీయ హత్య కానప్పుడు ఎందుకు రామారావును హత్య చేయాల్సి వచ్చిందో పోలీసులు వివరించాలని రాజకీయ హత్య కానప్పుడు ఆర్థికపరమైన అంశాలతో కూడిన హత్య అయినప్పుడు ఇందుకు ప్రోత్సహించింది ఎవరు...? సుపారి ఇచ్చింది ఎవరు...? హత్య వెనక ఉన్నది ఎవరన్నది ఎందుకు తేల్చడం లేదని సిపిఎం ఆందోళన బాటపట్టింది. 35 రోజులుగా హత్య కేసు కొలిక్కి రాకపోవడంతో రక రకాల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఇదే క్రమంలో పోలీసులు విభిన్న కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో సుపారి హత్య జరగడం అది కూడా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో జరగడం, హత్య జరిగి నెల గడిచినా నిందితులను అదుపులోకి తీసుకోకపోవడం రాజకీయ విమర్శలకు తావిస్తుంది. పోలీస్ దర్యాప్తు ముమ్మరంగానే సాగుతుందని కానీ హత్యకు సంబంధించి సాంకేతిక ఆధారాలు లభ్యం కావడం లేదని తెలుస్తున్నది. ఇప్పటికే పదుల సంఖ్యలో అనుమానితులను విచారించడంతో పాటు వందల సంఖ్యలో ఫోన్లపై నిఘా ఏర్పాటు చేశారు. ఏ అంశాన్ని వదలకుండా దర్యాప్తు చేస్తున్నారన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ కేసు కొలిక్కి రాకపోవడమే విమర్శకు కారణమవుతుంది. సుపారీ హత్యల్లో నిందితుడు ఘటన స్థలంలో దొరకడం లేదా సిసి పుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాలు ఉంటే తప్ప కేసును ఒక కొలిక్కి తీసుకు రావడం కష్టమే. దర్యాప్తులో జాప్యం కారణంగా హత్య కేసు రాజకీయ కోణం వైపు మలుపుతిరుగుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ హత్యలు చాలా జరిగాయి. ప్రత్యర్థులు పలువురిని హతమార్చిన ఘటనలు తదనంతరం ప్రతి దాడులు ఎన్నో చోటు చేసుకున్నాయి. కానీ ఒక రాజకీయ నాయకున్ని సుపారి ఇచ్చి హత్య చేయించడమన్నది సంచలనమే గాక ఇప్పటి వరకు దర్యాప్తులో జాప్యం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల చోటు చేసుకున్న హత్యలకు సంబంధించి పోలీసులు పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఛేదించిన విషయం విధితమే. కానీ రామారావు హత్య కేసులో ఆ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎందుకు ఉపయోగపడలేదు అన్నది కూడా ఒక ప్రశ్నగా మారింది. మొత్తంగా రాజకీయ పార్టీలు మొదలు సామాన్యులు సైతం పోలీస్ శాఖ వైపు వేలెత్తి చూపేలా చేసిన ఈ హత్య కేసు దర్యాప్తు ముగిసి నిందితులను అదుపులోకి తీసుకునే వరకు జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగానే మిగులుతుంది.

## రాష్ట్రంలో రోడ్లను విస్తరించండి

-ఎంపి వద్దిరాజు రవిచంద్ర



ప్రజాపక్షం/ ఖమ్మం : రాష్ట్రంలో ప్రధానమైన రహదారులను విస్తరించడంతో పాటు అభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. గురువారం ఆయన చాంబర్‌లో కలిసి రాష్ట్రంలో విస్తరించాల్సిన, అభివృద్ధి చేయాల్సిన రోడ్ల వివరాలను అందజేశారు. వద్దిరాజు వినతికి ఆయన సానుకూలంగా స్పందించారు.

## గెలుపుపై ధీమా వ్యక్తం చేసిన టిడిపి నేతలు



ప్రజాపక్షం/మణుగూరు:స్థానిక టీడీపీ ఎన్నికల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల టిడిపి నేతలు టిడిపి అభ్యర్థి బచ్చల భారతి గెలుపు పై ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల వాగ్దానం మేరకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి పినపాక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శ్రేణులు సహకరించిన విషయం విధితమే అన్నారు. అయినప్పటికీ ఎన్నికల వాగ్దానంగా సమితి సింగారం సర్పంచ్ సీటు టిడిపికి కేటాయిస్తారన్న ఒప్పందంలో భాగంగా ప్రస్తుత పంచాయతీ ఎలక్షన్ చివరి నిమిషం వరకు ఇచ్చిన మాట కోసం వేచి ఉన్నప్పటికీ కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. ఇది ఇలా ఉండగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు తుళ్లూరు బ్రహ్మయ్యని టిడిపి నాయకులు సంప్రదించగా ఇచ్చిన మాట కట్టుబడి కాంగ్రెస్ మద్దతు తెలుపుతుందని భరోసా ఇచ్చారన్నారు. కావున కాంగ్రెస్ బలపరిచిన టిడిపి అభ్యర్థిగా బచ్చల భారతి తన ప్రచారాన్ని తనదైనా శైలిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి ప్రజలను ఓటు అభ్యర్థిస్తూ ముందుకు వెళ్తున్నాం అన్నారు. ఎన్నో ఏళ్లుగా అవినీతి అనే పదమే తెలియని శుభ్ర పరిపాలన అందించిన సర్పంచ్ బచ్చల భారతి మళ్లీ ప్రజల మధ్యకు వచ్చారన్నారు. గతంలో పారదర్శకత, నిబద్ధత, అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా పనిచేసిన ఆమెపై గ్రామస్తులకు మంచి నమ్మకం ఉందన్నారు. తెదేపా నాయకత్వం మద్దతుతో బచ్చల భారతి ఈసారి నామినేషన్ దాఖలు చేశారు అన్నారు. అభివృద్ధి పనులలో ముందుండి పనిచేసిన ఆమె, మరోసారి ప్రజలకు చేరువై సేవ చేసే అవకాశం ఇవ్వాలని మండల టీడీపీ నేతలు కోరుతున్నారు.

# సిపిఐ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

గెలిపించాలని అన్నారు. తనికెళ్లలో భారత కమ్యూనిస్టుపార్టీని పూర్వ వైభవంలోకి తీసుకురావాలని తెలిపారు. కమ్యూనిస్టుపార్టీ మీద నమ్మకంతో కాంగ్రెస్‌పార్టీ, బిఆర్ఎస్, బిజెపి, సిపిఎం మద్దతునిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించాలని అప్పుడే అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరుతుందని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సర్పంచ్ అభ్యర్థిని గడల కళావతి, గడల భాస్కర్‌రావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర రావు, జిల్లా నాయకులు పిచిరావు, పిన్నం పుల్లయ్య, బాణోత్ వీరయ్య, పెదమళ్ల రత్తమయ్య, భూక్యా ఆదిలక్ష్మి , బాసా నాగరాజు, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి జనార్ధన్, చల్లా నరసింహారావు, పొట్లపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురంలో రసవత్తరంగా ఎన్నికల ప్రచారం

ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురంలో ఎన్నికల ప్రచారం రసవత్తరంగా నడుస్తుంది. నిన్నటి వరకు నడిచిన నామినేషన్ల పర్వం ఉపసంహరణ తీరుతో రాజకీయాలు వేడెక్కిన సమయంలో నేటి నుండి ప్రారంభమైన ప్రచారం పార్టీలు నువ్వా నేనా అనే స్థాయిలో ముందుకు దూసుకువెళ్తున్నాయి. అధికారకంగా పార్టీలు బలపరిచిన అభ్యర్థులు వారికి వచ్చిన గుర్తులతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. రకరకాల హామీలతో ప్రజల ముందుకు వెళ్తుతూ వారి మనలను అందుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఏది ఏమైనా అశ్వాపురంలో త్రిముక పోరుకు సిద్ధపడగా కొన్ని పార్టీలు ఒక అభ్యర్థిని అదే పార్టీలో రెండు వర్గాలుగా , ఒక అభ్యర్థిని రెండు పార్టీలతో ప్రత్యక్షంగా పోటీకి వెళ్లా ప్రజలను కాస్త గందరగోళానికి తరలింపుతున్నారు. చివరకు అశ్వాపురంలో రాజకీయ ఎన్నికల ప్రచారం రోజురోజుకి కొత్త పంతులు తొక్కుకుందటంలో సందేహం లేదు. చివరకు గెలుపు గుర్రంపై ఎవరు స్వారీ చేస్తారో చూడాలని మండల ప్రజలు తహతహలాడుతున్నారు.


## సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సన్మానం





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవమైన మల్లెపల్లి , రేగులచలక సర్పంచ్, ఉప సర్పంచ్‌లను సన్మానించారు. గురువారం మల్లెపల్లి, రేగులచలక నూతన పాలక వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగులచలక ఉప సర్పంచ్‌గా నున్నా వెంకటేశ్వర్లు, మల్లెపల్లి ఉప సర్పంచ్‌గా బండి వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్‌వో ఆధ్వర్యంలో నియామక పత్రాలను అందజేశారు. నూతనంగా ఎన్నికైన రేగులచలక సర్పంచ్ యండపల్లి రమాదేవి సత్యం, ఉప సర్పంచ్ నున్నా వెంకటేశ్వర్లు, మల్లెపల్లి సర్పంచ్ తేజావత్ బద్రి, ఉప సర్పంచ్ బండి వెంకన్నలను కాంగ్రెస్ నాయకులు, సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, బాలగంగాధర్ తిలక్, చంద్ర రాంబాబు, నల్లమల ఆనంద్, కన్నం ప్రసన్నకృష్ణ, గ్రామస్తులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సర్పంచ్, ఉప సర్పంచ్ లు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## భువనేశ్వరి వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలుగుదేశం నాయకురాలు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. ఆమె గురువారం హైదరాబాద్ నుండి ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెం వెళ్తుండగా ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్ గూడెం చెక్‌పోస్టు వద్ద ఆమె వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో సాధారణ తనిఖీల్లో భాగంగా భువనేశ్వరి వాహనాన్ని తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు.

## కొత్తవెంకటగిరి సర్పంచ్‌గా దీవెల వెంకటేశ్వర్లు నామినేషన్



ప్రజాపక్షం/తల్లాడ : తల్లాడ మండల పరిధిలోని కొత్తవెంకటగిరి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేశారు. గ్రామస్తులతో భారీ ర్యాలీతో నామినేషన్ వేశారు. వివిధపార్టీ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీనియర్ నాయకుడిగా గ్రామాన్ని అభివృద్ధిచేసిన నేతగా ఆయనకు మంచి పేరుఉంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ తల్లాడ మండల నాయకులు జక్కంపూడి కిషోర్, వైరా మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ దీవెల కృష్ణయ్య, కొత్తవెంకటగిరి మాజీ సర్పంచ్ దిరిశాల సత్యనారాయణ, సామినేని రాము, అప్పారావు, కాంగ్రెస్ , టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహనీయుల జీవితం ఆదర్శనీయం

## -కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్థంతి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ లు పాల్గొని రోశయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా, ఆర్థిక, రవాణా, గృహ నిర్మాణ, వాణిజ్య పన్నులు, విద్యా, వైద్యశాఖ మంత్రిగా విశిష్ట సేవలను అందించారన్నారు. తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లో గవర్నర్‌గా పనిచేశారని తెలిపారు. మహనీయుల జీవితం మనందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మత్స్యశాఖాధికారి శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఎఫ్ఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మల్లు నందిని జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, అమ్మా ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని జన్మదినం సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మల్లు నందిని ముఖ్యఅతిధిగా హాజరై జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయుకులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క మధిర నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేసి విశేష కృషి చేస్తున్నారని, మధిర నియోజకవర్గ అభివృద్ధిలో మల్లు నందిని భర్త అడుగుజాడల్లో నడుస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి తమవంతుగా కృషి చేయటం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్‌లో మల్లు నందిని మరెన్నో పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, పట్టణ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, జిల్లా నాయకులు సత్యంబాబు, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ స్థానాలకు 106 మంది పోటీ




**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలో సర్పంచ్ స్థానాలకు 106 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం 37 గ్రామ పంచాయతీలకు గాను రేగులచలక, మల్లేపల్లి, మంగ్యాతండా, రాములు తండా గ్రామ పంచాయతీలు సర్పంచ్, వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా రఘునాథపాలెం సర్పంచ్ స్థానంతో పాటు 10 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. రెండు వార్డులలో పోటీ నెలకొంది. మిగిలిన 32 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్ స్థానాలకు 106 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. బద్యాతండాలో నలుగురు, బావోజీతండాలో ఇద్దరు, బూడిదంపాడులో ముగ్గురు, చెరువుకొమ్ము తండాలో ముగ్గురు, చిమ్మపుడిలో నలుగురు, చింతగుర్తిలో నలుగురు, దొనబండలో ఐదుగురు, ఈర్లపుడిలో నలుగురు, జికె బంజరలో ఇద్దరు, గణేశ్వరంలో ఇద్దరు, హర్యాతండాలో ఎనిమిది మంది, కెవి బంజరలో ఇద్దరు, కొర్లబోడుతండాలో ఇద్దరు, కోటపాడులో ముగ్గురు, కోయచలకలో ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీలో ఉన్నారు. లచ్చిరాంతండాలో ముగ్గురు, మంచుకొండలో ఇద్దరు, మూలగూడెంలో ఇద్దరు, ఎన్‌వి బంజరలో ఇద్దరు, పంగిడిలో నలుగురు, పాపటపల్లిలో ఆరుగురు, పరికలబోడులో ఐదుగురు, పుటాని తండాలో నలుగురు, పువ్వాడ నగర్‌లో ఏడుగురు, రజబ్‌అలీ నగర్‌లో ఇద్దరు, రాంక్యాతండాలో ఇద్దరు, శివాయిగూడెంలో ఇద్దరు, సూర్యాతండాలో ఇద్దరు, విఆర్ బంజరలో ఇద్దరు, వి. వెంకటాయపాలెంలో ముగ్గురు, వేపకుంట్లలో ఐదుగురు, జింకల తండాలో ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్ స్థానానికి పోటీ పడుతున్నారు. ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య గ్రామాల్లో పోరు కొనసాగుతుంది. వి. వెంకటాయపాలెం గ్రామంలో కాంగ్రెస్, సిపిఐ మధ్య పోటీ నెలకొంది.

# ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య వర్థంతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నందు రోశయ్య వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం కళ్యాణ మండపం నందు జరిగిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్యవైశ్య ముద్దుబిడ్డ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా కొణిజేటి రోశయ్య చేసిన సేవలను కొనియాడారు. ఆర్యవైశ్యులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి నాళ్ళ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మైలవరపు వీరభద్రం, మధిర మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చారుగుండ్ల వెంకటలక్ష్మీ నర్సింహామూర్తి, కపిలవాయి జగన్మోహన్‌రావు, గుండెల ముత్తయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

# ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/చింతకాని :** గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అనుగుణంగా వ్యవహరించాలని ఏసీపీ సాంబరాజు పేర్కొన్నారు. గురువారం చింతకాని పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్ , వార్డు మెంబర్లుగా పోటీ చేసే అభ్యర్దులకు అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అభ్యర్దులు నడుచుకోవాలని, ఓటర్లను బెదిరించినా, మద్యం, , డబ్బులు , కులాలు, మతాల పేరుతో ప్రలోభాలకు గురిచేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని , నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కేసులు పెడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్సై వీరేందర్, ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి, సిబ్బంది శ్రీనివాస్ , అభ్యర్దులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# సిపిఐని గెలిపిస్తే మల్లారాన్ని ఆదర్శ గ్రామంగా నిలుపుతా

## - సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణి



**ప్రజాపక్షం/ మధిర :** సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు సిపిఐని ఆదరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మల్లారం గ్రామ సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణి గ్రామ ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన మల్లారం సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత స్థానిక ఎన్నికల్లో అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు ఎంపిటిసికి పోటీచేస్తే గ్రామ ప్రజలు ఆయన్ని గెలిపించుకున్న తీరు నాగేశ్వరరావుపై గ్రామ ప్రజలు చూపించిన ఆదారాభిమానాలు మరువలేనిదని రాణి స్పష్టం చేశారు. నాగేశ్వరరావు గ్రామానికి సేవ చేయలేకపోయారని, గ్రామానికి సేవ చేయాలనుకున్న తన ఆలోచన ఆయన భార్యగా నేను తీసుకున్నానని, ఈ స్థానిక ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, నా భర్త నాగేశ్వరరావు ఆదరించినట్లు నన్ను ఆదరించి గెలిపించాలని గ్రామ ప్రజలు కోరారు. సిపిఐని మల్లారం గ్రామ ప్రజలు గెలిపిస్తే గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో కరివేద రాంబాబు, దుర్గాభవాని, వెంకటేశ్వరరావు, చిన్న నాగమణి, గొల్లమందల శాంతకుమారి, మచ్చ వెంకటేశ్వరరావు, దాసరి సురేష్, కుటుంబరావు, కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 33 కెవి విద్యుత్ లైన్ ఏర్పాట్లను నిలిపివేయాలని నిరసన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం పాలడుగు గ్రామంలో 33 కెవి విద్యుత్ లైన్ ఏర్పాట్లను నిలిపివేయాలని స్థానికులు నిరసన చేపట్టారు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న 33 కెవి లైన్ విద్యుత్ స్థఃభాల టవర్ల ఏర్పాటును స్థానికులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పాలడుగు సమీపంలో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు 33 కెవి విద్యుత్ లైన్‌లను పాలడుగు గ్రామం నుంచి వేయడం వలన స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్‌లు ఏర్పాటును వెంటనే మార్చాలని స్థానికులు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో రైతు మృతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని సామ్యతండా గ్రామానికి చెందిన రైతు గుగులోత్ కిషన్ నాయక్(44) గుండెపోటుతో మృతి చెందారు. గురువారం గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందారు. ఇద్దరు మగ పిల్లలు, ఒక అమ్మాయి ఉన్నారు. అ మ్మాయికి వివాహం చేశారు. రైతు గుగులోత్ కిషన్ గుండెపోటుతో మృతి చెందడంతో సా మ్యతండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# జిపివోల సంఘం మండల కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పాలన అధికారుల రఘునాథపాలెం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిపివో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు చీమల నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో గురువారం జిపివోల అసోసియేషన్ రఘునాథపాలెం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా తాళ్లూరి రాము అధ్యక్షులుగా బానోత్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మాలోత్ వస్యా, సహయ కార్యదర్శిగా కె. నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలిగా సునీత, సభ్యులుగా సురేష్, రాజారత్నం, మదన్‌మోహన్, రవి తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కమిటీ జిల్లా కమిటీకి కొన్ని సూచనలు చేసింది. జిపివోల స్టేషనరీపై చర్చించాలని, జిపివోలకు హెల్త్ కార్డులు, సర్వీస్, రికార్డ్ అసిస్టెంట్ స్కేల్ గల జిపివోల విషయంపై చర్చించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చీమల నాగేంద్రబాబు మాట్లాడుతూ మండల కమిటీ సూచనలను రాష్ట్ర స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలోని 21 మండలాల్లో సంఘం బలంగా ఉందని , జిపివోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ కె. బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మల్లు నందిని జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టీవిక్రమార్క సతీమణి, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మల్లు నందిని పుట్టినరోజు వేడుకలు మధిరలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ పాల్గొని మల్లు నందినికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ప్రజలకు మరింత సేవలు చేయాలని అన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో మల్లు నందినితో కలిసి నూతి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఊపందుకున్న తొలి విడత ప్రచారం

**- గెలుపుపై ఎవరి ధీమా వారిదే**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా తొలివిడత ప్రచారం ఊపందుకుంది,. జిల్లాలోని 159 గ్రామపంచాయితీలకు, 1436 వార్డుల్లో తొలివిడత ఈ నెల 11వ తేదిన ఎన్నిక జరగనుండగా అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సిపిఐ దోస్తీ కట్టి అభ్యర్థులను బలపరుస్తోంది. బిఆర్ఎస్‌తో సిపిఎం, గిరిజన సంఘాలు పొత్తులో ఉన్నాయి. బిజెపి తో టిడిపి, జనసేన జతకట్టి వారివారి అభ్యర్థులను బలపరుస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా వార్డుల్లో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలియ తిరుగుతూ ఓటర్లను ప్రసన్నత చేసుకునేందుకు కుస్తీలు పడుతున్నారు. తమను గెలిపిస్తే అది చేస్తాం, ఇది చేస్తాం అంటూ దండాలు పెట్టుకుంటూ ఏకరువు పెడుతున్నారు. దీంతో గ్రామాల్లో ఆయా రాజీయపార్టీల జెండాలు బలపరిచే అభ్యర్థుల హడావిడి పెరిగింది. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడూ అధికార రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉంటాయంటూ పలువురు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

## సిపిఐ బలపరిచిన అభ్యర్థిని గెలిపించండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా సిపిఐ బలపరిచిన 16వ వార్డు అభ్యర్థిగా పోటీలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పితాని హెప్సిబా ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆమె వార్డులో గురువారం విస్తృత ప్రచారం చేశారు. పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుకున్న తనకు ప్రజలకు సేవచేసే అవకాశాన్ని ఇవ్వాలన్నారు. ఎంతో కాలంగా అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదని, తాను గెలిచిన వెంటనే ప్రథమ ప్రాధాన్యతగా దానిని ప్రారంభిస్తానని చెప్పారు. వార్డులో నెలకొన్న మౌళిక సదుపాయాల కల్పనలో ముందుండి పనిచేస్తానని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సాధనపల్లి సతీష్, నాయకులు పసుపులేటి నాగు, తాళ్లచంటి, రాంబాబు,స్వప్న,మరియమ్మ,ధనలక్ష్మి పాల్గొన్నారు.

## గడగడపకు మానే ప్రచారం



**ప్రజాపక్షం/భద్రాచలం :** పట్టణంలోని 18,19,20 వార్డుల్లో బిఆర్ఎస్ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి మానె రామకృష్ణ గురువారం ప్రచారం నిర్వహించారు. సిపిఎం, జిడిపి జేఏసి సంఘాలతో కలిసి ఆయన వార్డుల్లో కలియతిరిగారు. సౌమ్యునిగా పేరున్న మానే రామకృష్ణ ప్రచారానికి చక్కటి స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను సర్పంచ్ అభ్యర్థిగా ఆదరించి దీవించాలని, ఈనెల 11వ తేదిన జరిగే ఎన్నికల్లో 5 నెంబర్‌లో ఉన్న తన ఎన్నికల గుర్తు లేడీపర్సుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తానను సర్పంచ్‌గా గెలిపిస్తే భద్రాచలం గ్రామపంచాయితీ పరిధిలో దశాబ్ద కాలంగాపేరుకు పోయిన సమస్యలను పరిష్కారంచేందుకు కృషి చేస్తానని, ప్రధాన సమస్యలకు ఓ పరిష్కార మార్గాన్ని చూపుతామనని అన్నారు. ప్రజా సేవ చేయాలనే ఏకైక లక్ష్యంతో ఉన్న తనను భద్రాచలం ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యకమంలో పలువురు పాల్గొన్నారు.

## సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా మమత నామినేషన్



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మండల మాజీ వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆళ్లపల్లి గ్రామ పంచాయితీ ఎన్నికల్లో భాగంగా ఆళ్లపల్లి పంచాయితీ సిపిఐ పార్టీ సర్పంచ్ అభ్యర్థిగా మెస్సు మమత నామినేషన్ వేశారు. మెస్సు మమతని కసనబోయిన నరేష్ బలపరిచారు.

## అభివృద్ధి చేస్తా ఆదరించండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచల పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు శివారు కాలనీలను సైతం ప్రధాన వీధులు మాదిరిగా తీర్చిదిద్దుతానని, ఓటరు దేవుళ్లు ఆదరించాలని తెలుగుదేశం, జనసేవ మిత్రపక్షాల బిజేపి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి హరిచంద్రనాయక్ అన్నారు. గ్రామపంచాయితీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్‌గా బరిలో ఉన్న ఆయన ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 1వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజేపి,టిడిపి నాయకులు కుంజా ధర్మారావు, కుంచాల రాజారామ్, రామ్మోహన్ రావుతో పాటు ఆయన ఓటర్లను కలిసి తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల పాటు గ్రామపంచాయితీకి ఎన్నికలు లేక అభివృద్ధి కుంటుపడిందని, ఒక విజన్‌తో తాము ఎన్నికల్లో నిలిచామని చెప్పారు. ప్రజాసేవ చేయాలని ఆకాంక్షలు, స్వలాభాపేక్ష లేని వారికి ఓటు వేసి గెలిపిస్తే గ్రామ పంచాయితీ సమగ్రాభివృద్ధికి నోటుకుంటుందని తెలిపారు. ఈనెల 11న జరిగే తొలివిడత ఎన్నికల్లో తమ ఎన్నికల గుర్తు ఫుట్‌బాల్ అని, 4వ నెంబర్లో గల ఆ ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిజేపి,టిడిపి,జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ముగ్గురు మధ్యే పోటీ..!

**- హస్తం గూటిలో కుదిరిన సయోధ్య**
**- తీవ్ర నిరాశలో మాజీ సర్పంచ్ శ్వేత**
**- ఎవరి మెడలోనో వరమాల**







**ప్రజాపక్షం/భద్రాచలం :** దశాబ్దకాలం తర్వాత భద్రాచలం మెజర్ గ్రామపంచాయితీకి జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర పోటీ నెలకొంది. అభ్యర్థుల తుదిజాబితా ఖరారు కావడంతో తొలివిడత ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ప్రధాన పోటీ సర్పంచ్ పదవిదే కావడంతో ఆ ముగ్గురు మధ్యే తీవ్రమైన పోటీ ఉండే అవాశం ఉంది. సర్పంచ్ అభ్యర్థులుగా మొత్తం ఐదుగురు సభ్యులు పూనెం కృష్ణ దొర, మానే రామకృష్ణ, హరిచంద్రనాయక్, పూనెం ప్రదీప్, కొమరం కృష్ణవేణి భరిలో ఉన్నారు. కాగా సిపిఐ పొత్తులో కాంగ్రెస్ బలపరిచిన పూనెం కృష్ణ, సిపిఎం, గిరిజన సంఘాలు బలపరిచిన మానె రామకృష్ణ, టిడిపి, జనసేన మిత్రపక్షంగా బిజేపి బలపరిచిన హరిచంద్ర నాయక్‌ల మధ్య ప్రధాన పోటీ నెలకొననుంది. ఒకానొక దశలో హరిచంద్రనాయక్ అభ్యర్థిత్వానికి చిక్కు ఎదరవడంతో కోర్టు మెట్లు ఎక్కాల్సి వచ్చింది. కోర్టు జోక్యంతో ఆయన పోటీలో నిలిచేందుకు అవకాశం దక్కింది. సుదీర్ఘ కాలంగా భద్రాచల ప్రాంత ప్రజలకు సుపరిచితుడైన పూనెం కృష్ణ దొర మాజీ వార్డు సభ్యునిగా కూడా పనిచేసిన అనుభవం ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ బలపరుస్తుండటంతో గెలుపు ఖాయమని ఆయన భావిస్తున్నారు. నామినేషన్లు సమర్పించే క్రమంలో ఎంఎల్‌ఏ తెల్లం వెంకట్రావు, మాజీ ఎంఎల్‌ఏ, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొందెం వీరయ్య వర్గాలు కాంగ్రెస్ పార్టీ బలంతో వేర్వేరుగా నామినేషన్లు సమర్పించాయి. ఈ రెండు వర్గాల మధ్య ఎట్టకేలకు సయోధ్య కుదరడంతో ఇరు వర్గాల వారు ఓ నిర్ణయానికి వచ్చి సీట్ల సర్దుబాటు చేసుకోవడంతో సమస్య కొలిక్కివచ్చినప్పటికీ సంఘాల బెడద తప్పేలాలేదు. మరో ప్రక్క తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో పాల్గొని, టిఆర్ఎస్ నుండి భద్రాచలం ఎంఎల్‌ఏ అభ్యర్థిగా పోటీ చేసిన మానె రామకృష్ణకు సౌమ్యునిగా పేరుంది. అన్ని వర్గాల వారితో కలిసిమెలిసి ఉండే స్వభావం ఉన్న ఆయనను ప్రజలు ఆదరిస్తారనే నమ్మకం పెట్టుకున్నారు. ప్రధానంగా బిఆర్ఎస్ పార్టీ బలపరుస్తూ సిపిఎం పొత్తులో భరిలో ఉండటంతో గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సాంప్రదాయం ప్రకారం రాష్ట్రంలో అధికారం ఓ పార్టీ చేతిలో ఉంటో ఇక్కడ వేరే పార్టీ పార్టీ అభ్యర్థి గెలవడం జరుగుతోంది. కానీ ఇప్పుడు సర్పంచ్ ఎన్నిక వ్యవహారంలో ఆ సాంప్రదాయం కొనసాగుతుందా లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. సాధారణంగా అధికార పార్టీకే స్థానిక సంస్థల ఎన్నికలు అనుకూలంగా ఉంటాయని విశ్లేషకులు అంటున్నారు. కానీ మానె విషయానికి వచ్చే వరకు ఆయన మంచితనం ఆయన వెనుకున్న అంగబలం విజయ తీరాలకు చేర్చే అవకాశం లేకపోలేదనే వాదన కూడా అంతే బలంగానే ఉంది. ఇక టిడిపి, జనసేన పొత్తుతో బిజేపి బలపర్చిన, ప్రత్యక్ష రాజకీయాల్లోకి తొలిసారిగా అడుగుపెట్టిన సర్పంచ్ పోటీదారుడు హరిచంద్ర నాయక్. ఈయన తన గెలుపు సునాయాసమే అనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం మేజర్ గ్రామపంచాయితీని నిస్వార్థంగా అభివృద్ధి చేసేందుకు బరిలో ఉన్నట్లు, తానుగెలిస్తే ఈ మేజర్ గ్రామ పంచాయితీని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన పంచాయితీగా తీర్చిదిద్దేంకు, పార్టీలకు అతీతంగా పనిచేసేందుకు తన వద్ద ప్రత్యేక ప్రణాళికలు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి పెద్దలతో మాట్లాడి భద్రాచలం సంపూర్ణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెచ్చేందుకు పాటుపడతానని అంటున్నారు. ఇదిలా ఉండగా ఆదివాసీ, లంబాడీల మధ్య ఉన్న రగడ ఎటు వైపుకు దారితీస్తుందో వేచిచూడాలి.

### తీవ్ర నిరాశలో శ్వేత

ఉమ్మడి రాష్ట్రంలో భద్రాచలం గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా టిడిపి బలంతో భూక్యా శ్వేత పనిచేశారు. కాగా ఈ సారి కూడా పోటీ చేసేందుకు పొదెం వీరయ్య వర్గం నుండి ఆమె సిద్ధపడ్డారు. తనను సర్పంచ్‌గా గెలిపిస్తామని మాటిచ్చారని, అందుకే నామినేషన్ వేస్తున్నట్లు తానే స్వయంగా చెప్పారు. కానీ కాంగ్రెస్ ఇరు వర్గాల మధ్య ఉన్న వివాదం సమసిపోవడంతో పొదెం వీరయ్య వర్గం నుండి సర్పంచ్ అభ్యర్థిగా భరిలో ఉన్న ఆమె ఉపసంహరించుకోక తప్పలేదు. ఆఖరికి రెబల్ అభ్యర్థిగా అయినా భరిలో ఉందామని ప్రయత్నించినప్పటికీ ఎంపిపిగా అవకాశం కల్పిస్తామని పెద్దలంతా నమ్మబలకడంతో ఆమె నిమ్మకుండిపోయారు. గత సర్పంచ్‌గా పోటీ చేసిన సమయంలో ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆమెను ప్రస్తుత రాజకీయ పరిస్థితులు రెంటికి చెడ్డ రేవడిలా చేశాయి.

### ఎవరి మెడలోనో వరమాల

భద్రాచలం మేజర్ గ్రామపంచాయితీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొన్న తరుణంలో ఎవరి గెలుపుపై వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పరిణామాలు,గిల్లికజ్జాలు,సామాజిక వర్గాల బలా బలాలు, అంగఅర్థ బలాల నడుమ ఎవరి మెడలో భద్రాచలం మేజర్ గ్రామ పంచాయితీ సర్పంచ్ వరమాల పడునుందో వేచి చూడాలి.

## పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ అభివృద్ధి పరంపర కొనసాగిస్తా

**స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పాయం**



**ప్రజాపక్షం/కరకగూడెం:** పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పరంపరను మరింత బలోపేతం చేయడానికి, స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరుగుతోందని గురువారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాలను సందర్శించి, ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని మనవి చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు దగ్గరగా ఉండే పాలన గ్రామ పంచాయతీ అని, అందుకే స్థానిక సంస్థలు బలపడితే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయి అన్నారు. ప్రజలకు అందుబాటులో సేవలు, పారదర్శక పాలన, సంక్షేమ పథకాల లబ్ధి ఇవన్నీ సులభంగా చేరతాయి అని పేర్కొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు....

కొత్తగూడెం ఎర్రం పొట్టయ్య, గొల్లగూడెం ఎల్లబోయిన ముత్తమ్మ, చొప్పాలా తోలెం సావిత్రి, తుమ్మలగూడెం తోలెం విజయకుమారి, అనంతారం మోకాళ్ళ కృష్ణకుమారీ, పద్మాపురం తోలెం రమేష్, రఘునాథపాలెం సోలం మౌనిక, తాటిగూడెం పూణెం శ్యాం కుమారి, వెంకటాపురం చౌలం కేశవరావు, కరకగూడెం పోలె బోయిన సుజాత, వట్టం వారి గుంపు వట్టం సమ్మక్క, చిరుమల్ల కొమరం సుగుణ, సమత్ బట్టుపల్లి పోలేబోయిన తిరుపతయ్య, బట్టుపల్లి తోలెం రమాదేవి, రేగళ్ల బాడుష పార్వతి, కన్నాయిగూడెం అజ్మీరా భాస్కర్.

### వార్డు సభ్యుల అభ్యర్థులు...

సంబంధిత పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వార్డు సభ్యులు ప్రతి ఇంటి సమస్యను గుర్తించి, వాటిని పంచాయతీ, మండల, జిల్లా స్థాయిల్లో త్వరగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నారు అన్నారు. వీరి ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదల సాధ్యమవుతోందన్నారు. వీధి దీపాల మరమ్మత్తులు,త్రాగునీటి సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రజలకు సులభతరం అవుతుందన్నారు. గ్రామ అభివృద్ధి నిధుల సమర్థ వినియోగం అన్నీ మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తే గ్రామాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, వీధి విద్యుత్ సదుపాయాల అభివృద్ధి పెండింగ్ పనులపై తక్షణ చర్య రైతులకు సబ్సిడీ పథకాలు, నీటిపారుదల సౌకర్యాల విస్తరణ మహిళా సంఘాలకు మరింత మద్దతు, వడ్డీ లేని రుణాలు యువతకు స్థానిక ఉపాధి అవకాశాల విస్తరణ గ్రామం,మండలం జిల్లా స్థాయిల్లో ఒకే పార్టీ ప్రతినిధులతో శీఘ్ర సమస్య పరిష్కారం అవుతాయని ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇగ్బాల్ హుస్సేన్, టిపిసిసి సభ్యులు చందా సంతోష్, మండల నాయకులు ఎర్ర సురేష్, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్పంచ్ భరి.. అప్పుల ఊబి..!




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** గ్రామపంచాయతీ ఎన్నికలు అంటే రాష్ట్ర రాజకీయాల్లో చాలా కీలకంగా పరిగణిస్తారు. గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలకు మామూలు పోటీ కావు. సర్పంచ్ ఎన్నికల్లో దిగేవారు జాగ్రత్తగా ఉండాలి. నేను సర్పంచ్ అనిపించుకోవడానికి 15 నుంచి 20 లక్షలు ఖర్చు చేస్తారు. కానీ ఓడిన తర్వాత తన కుటుంబాన్ని ఆ ఓటమి చ్ఛిదిమేస్తుంది. కావున సర్పంచ్ అభ్యర్థులు ఆలోచించి తమ ఖర్చు వ్యయాలను తగ్గించుకోవాలి. గెలవడం లక్ష్యంగా పెట్టుకుంటే గెలిచిన తర్వాత ఒత్తిడిలను అభివృద్ధి కష్టాలు భావించడం కష్టం. అభివృద్ధి చేసి అప్పుల ఊబిలో చిక్కి గతంలో ఎంతోమంది సర్పంచులు తమ సొంత డబ్బులతో రోడ్లు వీధిలైట్లు, భవనాలు నిర్మించారు. బిల్లులు రాక అప్పులు పేరుకుపోయిన ఘటనలు చాలా ఉన్నాయి. ఒక్కో సర్పంచ్ సుమారుగా 15 నుంచి 20 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేసిన ఉదాహరణలు ఉన్నాయి. సర్పంచ్ గా పోటీ చేసే అభ్యర్థులు అప్పుల భారం భరించలేక ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా నమోదయ్యాయి.

**-ఏకగ్రీవం పేరుతో బేరసారాలు**
**-రాజకీయ మోజులో జీవితాలు అతలాకుతలం**

### ఏకగ్రీవం పేరుతో బేరసారాలు...

మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీలలో ఏకగ్రీవం పేరుతో బేరసారాలు వెల్లివిరిశాయి. సర్పంచ్ స్థానాల కోసం లక్షల్లో డబ్బు ఆఫర్లు వినిపిస్తున్నాయి. చిన్న చిన్న పంచాయతీలకు సైతం 14 లక్షలు నుండి 16 లక్షలు వరకు పోటీ పడి బేర సారాలకు దిగారు. మరొక పంచాయతీలో ఏకంగా రూ. 22 లక్షల వరకు పోటీ పడగా మరో వర్గం ఒప్పుకోక పోవడంతో ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నారు. పల్లెలు దేశానికి పట్టు కొమ్మలు అంటారు. అయితే ఆ కొమ్మలకు బలం లేకుండా పోతుంది. గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం పగటి కలలా మారుతోంది. ముఖ్యంగా స్థానిక పాలనలో పెరుగుతున్న ధన ప్రలోభాలు, నాయకత్వ ఎంపికలో ప్రజాస్వామ్య స్ఫూర్తి తగ్గిపోవడం గ్రామాల అభివృద్ధిని దెబ్బతీస్తున్నాయి. గాంధీ ఊహించిన గ్రామ స్వయం పాలన, పౌరుల భాగస్వామ్యం, నైతిక నాయకత్వం అన్న భావనలు ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో కేవలం పుస్తకాలకే పరిమితమవుతున్నాయి.

### యువత ఓటు హక్కును అమ్ముకోకు...

ఓటర్లు కూడా తమ ఓటు హక్కు విలువను గుర్తించాలి. ఓటును డబ్బుకు మందు బాటిళ్లకు బిర్యానీలకు అమ్ముకుంటే రేపు మీరు ప్రశ్నించే హక్కు ఉండదు. డబ్బు తీసుకోకుండా ఓటు వేస్తే గ్రామంలో ఉన్న సమస్య వస్తే పరిష్కరించకుంటే ఎందుకు సమస్య పరిష్కారం కావట్లేదని నిలదీసే అధికారం ఉంటుంది. ఈ సారి గ్రామాల్లో యువతి యువకులు మహిళలు అందరూ ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఉంది. మన అభ్యర్థి విలువ ఉన్నవాడా చదువుకున్నవాడా అభివృద్ధి చేసే సామర్థ్యం ఉందా లేదా అని ప్రశ్న వేసుకుని సామర్థ్యం ఉన్న వ్యక్తిని గ్రామ సర్పంచిగా ఎన్నుకోవాలి.

# బెదిరించారా.. ప్రలోభాలకు గురి చేశారా..!

**-ఏకగ్రీవాలపై ఎన్నికల సంఘం ఆరా..**
**-క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించిన అధికారులు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంచాయతీ ఎన్నికల లో ఏకగ్రీవమైన పంచాయతీ సర్పంచ్లు, వార్డు సభ్యుల పై ఎన్నికల సంఘం ఆరా తీసింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నేలకొండపల్లి తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం క్షేత్ర స్థాయి లో విచారణ చేశారు. వివరాలు సేకరించారు. మండలం లోని ఆచార్లగూడెం లో సర్పంచ్, 8 వార్డులు ఏకగ్రీవం కావటం పై స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఓటర్లతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఏకగ్రీవం కావటానికి ఎవరైనా ఓటర్ల ను బెదిరించారా.. లేక ప్రలోభాలకు గురి చేశారా... భయభ్రాంతులకుపాల్పడ్డారు. తదితర విషయాల ను ఓటర్ల ను అడిగి వివరాలు సేకరించారు. అదే విధంగా బోదులబండ, కోరట్ల గూడెం, కొంగర, ఆజయ్ తండా, కట్టుకాచారం, అనాసాగారం, సదాశివపురం గ్రామాలలో మొత్తం 27 పంచాయతీ వార్డు సభ్యులు ఏకగ్రీవం కావటంతో ఆయా గ్రామాలలో విచారణ చేపట్టారు. ఓటర్ల వివరాలు, అభిప్రాయాలను పంచనామా చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్ రావు, అల్లం రవి కుమార్, ఆయా పంచాయతీ కార్యదర్శులు, జీపీవో లు తదితరులు పాల్గొన్నారు.



# పోటా పోటీగా నామినేషన్లు..!



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 17న జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అధికార ప్రతిపక్ష పార్టీలతో పాటు రెబల్ అభ్యర్థుల నుండి పోటా, పోటీగా నామినేషన్లు దాఖలు అవుతున్నాయి. రెండవ రోజు గురువారం నామినేషన్ల జోరు ఊపందుకుంది. పల్లెల్లో ఎక్కడ చూసినా పండగ వాతావరణం కనిపించింది. పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికలు, అభ్యర్థుల గెలుపోటములపై చర్చ సాగుతుంది. ఉంది అధికార పార్టీకి రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది. రెబల్స్ ను శాంతింప చేసేందుకు కాంగ్రెస్ నాయకులు బుజ్జగింపులకు దిగుతున్నారు. సత్తుపల్లి మండలంలోని కాకర్లపల్లి పంచాయతీలో అధికార పార్టీ టికెట్ నిరాకరించడంతో టిఆర్ఎస్, టిడిపి, సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) పార్టీల మద్దతుతో పొదిలి మారేష్ తన నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా కిష్టారం పంచాయితీ నుండి రావి నాగేశ్వరరావు, గంగారం పంచాయతీ నుండి పామర్తి భ్రమరాంబ, తుమ్మూరు గ్రామం నుండి కూసంపూడి వీరబాబు, బేతుపల్లి నుండి దొడ్డా రాజేంద్రప్రసాద్(అమ్ములు), సదాశివుని పాలెం నుండి బంకా సునితలు ఇండిపెండెంట్ గా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల విత్ డ్రాకు 9వరకు సమయం ఉండడంతో నామినేషన్లు వేసిన వారంతా బరిలో ఉండేది లేనిది మరో 5 రోజులు అనంతరం మాత్రమే తెలిసే అవకాశం ఉంది. అప్పటి వరకు అటు పల్లె ప్రజలతో పాటు ఆయా పార్టీల నాయకులకు ఉత్కంఠత తప్పేలా లేదు. ర్యాలీగా వచ్చి నామినేషన్ వేసిన అధికార పార్టీ అభ్యర్థులు మంచి ముహూర్తం చూసుకొని, ప్రజా బలాన్ని కూడగట్టుకుని అధికార పార్టీ అభ్యర్థులు ర్యాలీగా బయలుదేరి నామినేషన్ కేంద్రాలకు చేరుకొని తమ నామినేషన్ పత్రాలు అధికారులకు అందజేశారు. మండల పరిధిలోని రేజర్ల గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థినిగా కాంగ్రెస్ పార్టీ బలపరచిన బీమిరెడ్డి అరుణ భర్త మదన్ మోహన్ రెడ్డి, కిష్టారం గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ బలపరచిన నరుకుళ్ళ రాజేశ్వరి భర్త అప్పారావు, తుమ్మూరు గ్రామం నుండి సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ బలపరచిన చీకటి చిట్టీరావు తండ్రి పేరు సీతారామయ్య తదితరులు నామినేషన్లు దాఖలు చేశారు.

## కాంగ్రెస్ అభ్యర్థులు గెలిస్తేనే గ్రామాల్లో అభివృద్ధి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాక సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి కిషోర్ శివరాం నాయక్‌ని గెలిపించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహిమద్ ఖాన్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లుకి బూర్గంపాడు మండలంలోని 18 గ్రామ పంచాయితీలకు గాను ఐదు గ్రామ పంచాయితీలు ఏకగ్రీవం అయ్యాయని, మిగతా 13 కూడా గెలిచి మొత్తం 18 పంచాయితీలను ఎంఎల్‌ఏకి గిఫ్ట్‌గా ఇస్తామని అన్నారు.

## 1వ వార్డు ఏకగ్రీవ ఎన్నిక పట్ల కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/మణుగూరు:** పగిడేరు గ్రామపంచాయతీ 1 వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థి కామ్రేడ్ సనప ఇందిర ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికకు సహకరించిన గ్రామ పెద్దలకు, వివిధ రాజకీయ పార్టీ నాయకులకు ఇందిర కృతజ్ఞతలు తెలిపినట్లు శాంతి నగర్ ఇంచార్జ్ రావుల బాబు తెలిపారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/పెనుబల్లి:** డిసెంబర్ 17 జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను గురువారం కల్లూరు రెవిన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పెనుబల్లి తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్ కలిసి చింతగుడెం కేంద్రాన్ని పరిశీలించారు. నామినేషన్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యలు పట్ల పలు సూచనలు చేశారు. శాంతి భద్రతలు విషయంలో పోలీసులకు తగు సూచనలు చేశారు

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన ఏసిపి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 17 న జరగనున్న పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో రుద్రాక్షపల్లి, గంగారం, బేతుపల్లి గ్రామ పంచాయతీ క్లస్టర్ లలో జరుగుతున్న నామినేషన్ ప్రక్రియను గురువారం కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా విధులలో ఉన్న సిబ్బందికి నామినేషన్ సెంటర్స్ దగ్గర డ్యూటీ లో పాటించాల్సిన నియమాలు, సూచనలు చేశారు. ఏసిపి వెంట సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, సెక్టార్ ఎస్ఐ వీర ప్రసాద్ లున్నారు.

## క్రీడల్లో మంచి ఫలితాలు సాదించాలి



**ప్రజాపక్షం/గుండాల :** విద్యార్థినిలు క్రీడల్లో మంచి ఫలితాలను సాదించాలని గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేష్వర్ రెడ్డి సూచించారు.గురువారం జిల్లా ఎలక్షన్ అబ్జర్వర్‌గా మండల కేంద్రానికి విచ్చేసిన సందర్భంగా కాచనపల్లి క్రీడా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు, శిక్షకులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే స్పెషల్ మెనూ మరియు కాస్మోటిక్ , దుస్తులు సక్రమంగా అందుతున్నాయని విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. జరగనున్న పదోతరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతను సాదించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని అన్నారు. ప్రతి విద్యార్థిని క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రానించాలని సూచించారు. కార్యక్రమంలో ఎటిడిఒ భారతిదేవి, క్రీడల అధికారి గోపాల్‌రావు, హెచ్‌ఎం పద్మవతి, వార్డెన్ గుమ్మడి పాపయ్య, పిడి శిరోమణి, గొంది మారెప్ప, నాగరాజు ఉన్నారు.

## ప్రచారాలకు అనుమతి తప్పనిసరి : ఎంపిడిఓ

**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలో గల గ్రామ పంచాయతీలలో 2వ సాధారణ ఎన్నికలు 2025 శాంతియుతంగా, పారదర్శకంగా, చట్టపరమైన విధానాల ప్రకారం నిర్వహించబడేలా మండల పరిపాలన అన్ని చర్యలను చేపట్టింది అని మణుగూరు మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ తేళ్లూరి శ్రీనివాసరావు, సహాయ జిల్లా ఎన్నికల అధికారి (ఏడిఈఈ) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు కొన్ని ముఖ్య సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహిత ఎన్నికలు కావున, ప్రచారం, ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, లౌడ్ స్పీకర్ల వినియోగం వంటి కార్యక్రమాలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళి మేరకు జరగాలి అన్నారు. ప్రజల సహకారంతో మణుగూరు మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుతంగా, విజయవంతంగా జరుగుతాయనే నమ్మకంతో ఈ విజ్ఞాపన జారీ చేయబడింది అన్నారు.

# ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

**-ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలి**
**-అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలని, ఎన్నికలు సజావుగా ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ డిసిపి లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలంలో ఎన్నికలకు నామినేషన్ వేసిన సర్పంచ్, వార్డు సభ్యులతో గురువారం గణేష్ గార్డెన్స్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఆరోపణలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత కీలకమని, స్థానిక ఎన్నికలను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు, భయభ్రాంతులకు లోనుకాకుండా స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందుకు అవసరమైన వాతావరణం కల్పించడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అన్నారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి, సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐలు నరేష్, తేజశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి

**విలేజ్ బెల్లం చాయ్ కేఫ్ ప్రారంభంలో**
**కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి**



**ప్రజాపక్షం/వైరా:** వైరా ఆర్‌టిసి బస్టాండ్ కాంప్లెక్స్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన విలేజ్ కేఫ్‌ను గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యులు నూతి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఫ్ నిర్వాహకుడు బత్తుల రవిని ఆయన అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధితో ఎదిగి మంచి భవిష్యత్తుకు పునాది తీసుకోవాలని నేటి యువత చెడు వ్యసనాలకు లోనై బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని అన్నారు. బెల్లం చాయ్ ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. అనంతరం నూతి సత్యనారాయణ గౌడ్‌ను ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, వైరా పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మాజీ మున్సిపాల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, డాక్టర్ కాపా మురళీకృష్ణ, పొదిలి హరినాథ్, గంగులు, వేముల రత్నాకర్, పెద్దప్రోలు లక్ష్మయ్య, వీరంశెట్టి సీతారాములు, ఆర్యవైశ్య కార్పొరేషన్ జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాసరావు, బాబు సాహెబ్, మిట్టపల్లి నాగేశ్వరరావు, ముళ్ళపాటి రంగా, మరికంటి రాంగోపాల్, గుండెల రవి తదితరులు పాల్గొన్నారు.

# అభ్యర్థులు మేనిఫెస్టోను ప్రజలతో పంచుకోండి

**సాఫ్ట్వేర్ ఇంజనీర్, బీపీసీటీ చైర్మన్ వాసంశెట్టి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అమ్మగూడెం పంచాయతీ లో పోటీ చేసే అభ్యర్థులు వారి మేనిఫస్టోను ప్రజలతో పంచుకోవాలని స్థానికుడు, సాఫ్ట్వేర్ ఇంజనీర్, బీపీసీటీ చైర్మన్ వాసంశెట్టి పూర్ణచందర్రావు సూచించారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 40 ఏళ్ల గా గ్రామం అనుకున్నంత అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కనుక ప్రస్తుతం పోటీలో ఉన్న అభ్యర్థులు గ్రామానికి అభివృద్ధి చేసేందుకు వచ్చే 5 ఏళ్లలో చేసే పనులను మేనిఫస్టో ద్వారా ఓటర్ల కు తెలియజేయాలని సూచించారు. గ్రామంలో ఆలయం నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలి. అయ్యప్ప స్వామి సన్నిదానం నిర్మాణం పూర్తి కావటానికి అవసరమైన సహకారం అందించాలన్నారు. వీరన్న స్వామి ఆలయఅభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని కోరారు. ఫ్యాక్టరీ వద్ద అయ్యప్ప ఆలయం నిర్మాణం చేపట్టాలి. ఫ్యాక్టరీ నుంచి వస్తున్న కాలుష్యం ను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి. ఫ్యాక్టరీ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. నిజమైన అభివృద్ధి కావాలంటే స్పష్టమైన విజన్, బలమైన ప్రణాళికలు, ప్రజా సమస్యలపై నిజమైన స్పందన అవసరం అన్నారు. ఇరువురు అభ్యర్థులు మేనిఫస్టో ను ఓటర్లకు వివరించి, గ్రామాభివృద్ధి కి పాటుపడాలని కోరారు. గ్రామాభివృద్ధి లో తాను శక్తి వంచన లేకుండా తన వంతుగా సహాయం చేస్తామన్నారు.

# కాంగ్రెస్ నుండి పలువురు బిఆర్ఎస్‌లో చేరిక



**ప్రజాపక్షం/ఇల్లందు :** ఇల్లందు నియోజకవర్గంలోని ఇల్లందు మండలం రొంపేడు, విజయలక్ష్మి నగర్, తిలక్‌నగర్ నుండి కాంగ్రెస్, న్యూడెమోక్రసీ పార్టీల నుండి మాజీ సర్పంచ్ అజ్మీర శంకర్, అజ్మీర పార్వతి, ఎంఎల్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు బానోత్ దుగ్యా, బానోత్ పార్వతి, కిరణ్, రాంబాబు, బాలరాజు, వీరు, రామచందర్, న్యూ డెమోక్రసీకి చెందిన 50 కుటుంబాలు గులాబీ తీర్థాన్ని పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన వారికి ఇల్లందు మాజీ ఎంఎల్ఏ హరిప్రియనాయక్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తికల్‌నగర్, విజయలక్ష్మి నగర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ మండల ఆయకులు సువర్ణపాక సత్యనారాయణ ఆధ్వర్యంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్ఏ హరిప్రియనాయక్, దిండిగల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష లాంటిది తొలి ముఖ్యమంత్రి వర్యులు కేసీఆర్ పాలననని, కేసీఆర్ హయాంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయితీని అభివృద్ధి చేసుకోవడం జరిగిందని, మారుమూల పల్లెలకు కూడా కేసీఆర్ డిఎంఎఫ్టి నిధుల ద్వారా నియోజకవర్గంలో ప్రతి మారుమూల ప్రాంతాన్ని కూడా అభివృద్ధి పథంలో ముందుకు నడిపించడం జరిగిందన్నారు. ఈసందర్భంగా పార్టీలోకి చేరిన వారిని ఆహ్వానం పలుకుతూ పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా అహర్నిశలు కృషి చేయాలని తెలియజేస్తూ పార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వర్లు, జబ్బర్, మూడ్ హనుమాన్, బావ్‌సింగ్, అబ్దుల్ నబీ, లలిత్ పాసి, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పెట్రోలింగ్



**ప్రజాపక్షం/వైరా:** రానున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో వైరా పోలీసులు తమ సిబ్బందితో పుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. గతంలో ఎన్నికల్లో ఘర్షణలు జరిగిన గ్రామాల్లో వైరా ఎస్సై పుప్పాల రామారావు ఆధ్వర్యంలో సెక్టార్ అధికారి ఎస్సై పవన్, ఏఎస్ఐ యేసు, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గొల్లపూడి గ్రామంలో పుట్ పెట్రోలింగ్ నిర్వహించి అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు.

## దేవాలయం మాజీ చైర్మన్ కాంగ్రెస్‌లో చేరిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక శ్రీ రాజగోపాలస్వామి దేవాలయం మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు, మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు కురాకుల నాగేశ్వరరావు గురువారం రాత్రి కాంగ్రెస్ లో చేరారు. మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన తన అనుచరులతో కాంగ్రె స్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, మంత్రి శ్రీనివాసరెడ్డి చేస్తున్న అభివృద్ధి పనుల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. నేలకొండపలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గా ఉన్నత విద్యావంతురాలు అభ్యర్థి పుసుపులేటి శ్రీలత ద్వారా మేజర్ పంచాయతీ అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, మాజీ ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు పి.శ్రీనివాస్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధిగా రోశయ్య సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ప్రజాప్రతినిధిగా కొణిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య నాల్గవ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాల గవర్నర్‌గా విశిష్టమైన సేవలు అందించారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక భవిష్యత్‌కు ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు పరంధామరెడ్డి, విజయలక్ష్మి , రామిరెడ్డి తదితరుల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లోక్ ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం జిల్లా కోర్టులో ఈనెల 21న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మమన్ పాటిల్ వసంత్, కార్యదర్శి రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలు, వివాహ బంధానికి చెందిన కేసులు, ట్రాఫిక్ చాలానా, డ్రక్ అండ్ డ్రైవ్ కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, బ్యాంకు లావాదేవీలు, టెలిఫోన్ బకాయిల కేసులు, కొట్టుకున్నకేసులు, సైబర్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో లాజీ చేసుకుని కేసులను పూర్తి చేసుకోవాలని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా నడిచే విధంగా చూడాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల పరిధిలోని పంచాయితీ ఎన్నికలు నిర్వహించే గ్రామాలలో సర్పంచ్, వార్డ్ అభ్యర్థులతో అశ్వాపురం మండల సిఐ అశోక్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎన్నికల ప్రశాంతంగా నడిచే విధంగా చూడాలని అన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రజలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మల్లెలమడుగులో దూసుకుపోతున్న బిఆర్ఎస్



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలోని మల్లెలమడుగు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో సిపిఎం పార్టీ బలపరిచిన బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బండారు బలరాం ఎన్నికల ప్రచారంలో వేగంగా దూసుకుపోతున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలలో తనపై నమ్మకం ఉంచి గెలిపించాలని కోరుతూ గెలిచిన వెంటనే గ్రామంలోని ప్రజలకు పలు హామీలు ఇస్తూ రోడ్లు, నీరు, బడులు, గుడులు లాంటివి ఏ సమస్యలున్న పరిష్కరిస్తానని, ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనిని సమర్ధవంతంగా చేస్తానని ఎవరికి ఏ అతీత శక్తులకు లొంగనని మల్లెల మడుగు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రచార హామీలు ఇచ్చారు. ఆయన కత్తెర గుర్తును చూపిస్తూ ఆ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గ్రామ ప్రజలను కోరారు.

# శిశువు మృతిపై విచారణ



- ఆసుపత్రి నిర్వాహణలో లోటుపాట్లు
- అడ్మిట్ రికార్డులో కొట్టివేతలు
- ఆగ్రహం వ్యక్తం చేసిన డిప్యూటి డిఎం అండ్ హెచ్ఓ

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ దమ్మపేట సెంటర్‌లోని శ్రీ విజయా నర్సింగ్‌లో హోమ్‌లో గత నెలలో జరిగిన నవజాత శిశువు మృతిపై జిల్లా వైద్యశాఖ అధికారులు స్పంధించారు. గురువారం డిప్యూటి డిఎం అండ్‌హెచ్ఓ జయలక్ష్మి ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. విచారణ చేశారు. ఈ సంధర్భంగా బాదిత బాలింతను, బంధువులను జరిగిన ఘనటపై వివరాలు అడిగి తెలుసుకొన్నారు. నవంబర్ 26వ, తేదీ 4.30 గంటలకు ఆసుపత్రిలో జాయిన్ అయ్యామని, మరుసటి రోజు ఉదయం 8 గంటలకు వైద్యులు ఆసుపత్రికి చేరుకొని ఆపరేషన్ చేశారని, డాక్టర్ ఆలస్యంగా రావటం, సమయానికి వైద్యం అందించకపోవటంతో శిశువు మృతి చెందాడని వారు ఆరోపించారు. అనంతరం పేషెంట్‌పై తీసుకొన్న జాగ్రత్తలపై ఆసుపత్రి సిబ్బందితో తెలుసుకొన్నారు. కేస్ షీట్‌లో పేషెంట్ వివరాలను కొట్టివేసినట్లుగా గమనించారు, పేషెంట్ మెడికల్ రికార్డులు అందుబాటులో లేకపోవటంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. డ్యూటీ డాక్టర్ పర్యవేక్షణ లేకపోవటంతో మండిపడ్డారు. శిశువు కదలికలపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకొన్నారని, ఫొతాగ్రామ్ వంటి పరీక్షలు చేశారా? అని ప్రశ్నించారు. మృత శిశువు పట్ల ఆసుపత్రి యాజమాన్యం కఠిన వైఖరి అవలంభించినట్లు గుర్తించారు. మృతదేహానికి ఇవ్వాల్సిన కనీస మర్యాద కూడా ఇవ్వలేదని తెలిసి ఆశ్చర్యపోయారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వాహణలో కనీస సౌకార్యలు, రిజిష్టర్‌లో అస్పష్టంగా ఉన్న వివరాలు, శిశువు స్థితి రికార్డులు సక్రమంగా నమోదు చేయలేదని, ఆసుపత్రి రికార్డులు, నిర్వాహణ అస్తవ్యస్తంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వాహణ, కల్పిస్తున్న సౌకర్యాలు, నిభంధనలుతో సహా పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. మరోసారి విచారణకు వస్తామని వెళ్ళిపోయారు. ఆసుపత్రి యాజమాన్యం జంప్: ఆసుపత్రిలో జరిగిన ఘటనపై విచారణకు వచ్చిన అధికారిని చూసిన ఆసుపత్రి యాజమాన్యం అక్కడ నుండి జంపయ్యారని ఆరోపణలు, దీనిని గమనించిన కొందరు డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ కు సమాచారం అందించారు. దీనిపై స్పంధించిన ఆమె సీరియస్‌గా ఉన్నారు. బాదిత మహిళకు జరిగే న్యాయం, ఆసుపత్రిపై ఎలాంటి చర్యలు తీసుకొంటారని పాల్వంచ వ్యాప్తంగా చర్చలు సాగుతున్నాయి. ఈ విషయంపై ఆసుపత్రి యాజమాన్యం వివరణ కోరగా... మేము విచారణకు సిద్దంగా ఉన్నాం. ప్రభుత్వ నిభంధనల మేరకే ఆసుపత్రిని నిర్వహిస్తున్నామన్నారు. పారిపోవటం అనేది పచ్చి అబద్దమన్నారు. మా ఆసుపత్రి నుండి మేము పారిపోవటమనేది విడ్డూరంగా ఉందన్నారు. ఇది మేమంటే గిట్టనివారు చేస్తున్న ఆరోపణలని, దుష్ప్రచారమని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు వచ్చిన అధికారి మాకు కొంత సమయం ఇచ్చిందన్నారు. దానికి తగ్గట్టుగా అన్ని వివరాలు అందించామని చెప్పారు. విచారణకు వచ్చిన అధికారులకు మేము అన్ని విధాలుగా సహకరించామన్నారు. బాలింత భవానికి ఇప్పటికీ ఉచితంగానే వైద్యం అందిస్తున్నామని, రక్తం సైతం ఎక్కిస్తున్నామని స్పష్టం చేశారు.

## అసమ్మతి వద్దు.. ఆలోచించండి : ఎమ్మెల్యే రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అసమ్మతితో పార్టీకి వ్యతిరేకంగా నామినేషన్లు వేస్తున్న వారంతా ఆలోచించాలని, రానున్న అసమ్మతి వాదులందరికి అవకాశాలు కల్పిస్తామని అర్థం చేసుకొని నామినేషన్లు ఉపసంహరించుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ రెబల్స్ కు సూచించారు. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయంతో నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు పోటీగా నామినేషన్లు వేసిన అసమ్మతి నేతలు వెంటనే ఉపసంహరించుకోవాలని ఒకే పార్టీలోని ఇద్దరు నామినేషన్లు వేయటం వల్ల ఇతరులు గెలిచే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న నేపద్యంలో అభివృద్ధి కాంగ్రెస్ పాలన ద్వారానే సాధ్యపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తుందని, రెబల్స్ అర్థం చేసుకుని సహకరించాలన్నారు. ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారనే విషయం తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఇటువంటి సాంప్రదాయం లేదని, కొత్తగా ఈ పద్ధతి తీసుకురావద్దని హితవు పలికారు. సీనియర్ల సూచనలు, పార్టీ నిబంధనలు తప్పకుండా కార్యకర్తలు పాటించాలని పేర్కొన్నారు. సమాలోచలన ద్వారా పార్టీ మద్దత్తుతో ఒక్కరే పోటీలో ఉండాలని విజ్ఞప్తి చేశారు.

**రెబల్స్ కు దయానంద్ బుజ్జగింపులు...**

సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో పలు పంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు పోటీగా నామినేషన్లు వేసిన వ్యక్తులతో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ చర్చలు ప్రారంభించారు. రాబోయే ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని, పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఆయన హామీ ఇస్తున్నారు. పార్టీ నిర్ణయాన్ని దిక్కరించే ఆలోచనలు విరమించుకోమని విజ్ఞప్తి చేశారు. ఆశావాహులు అందరికీ ఆ పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని తెలిపారు.

# దుప్పుల సంరక్షణకు చర్యలు చేపడతాం




వేటగాళ్ళను వదలం
పోలీసుల సహకారంతో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నాం


అర్బన్ పార్క్‌లో ఏం జరుగుతుంది..?


**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని అర్బన్ పార్క్ లో దుప్పులు, జింకల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని ఫారెస్ట్ డివిజన్ ఆఫీసర్ మంజుల తెలిపారు. అర్బన్ పార్క్ లో ఏం జరుగుతుంది అంటూ ప్రజాపక్షం తెలుగు దినపత్రికలో గురువారం ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపద్యంలో సత్తుపల్లి ఫారెస్ట్ డివిజన్ అధికారిని కార్యాలయం నుండి గురువారం ఓ ప్రకటన విడుధల చేశారు. సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్ నందు ఇటీవల జరిగిన తుపాకీతో వన్యప్రాణి వేటకు ప్రయత్నం చేసిన కేసునకు సంబంధించిన నిందితుల్లో పంతంగి గోపి క్రిష్ణ, తండ్రి వెంకటేశ్వర్లు, సత్తుపల్లి, శౌంఠి శ్రీ రాంప్రసాద్ తండ్రి నారాయణ, సత్తుపల్లి అను ఇద్దరిని రిమాండ్ చేయడం జరిగిందని, మిగిలిన నిందితుల కోసం పోలీసుల సహకారంతో అటవీ శాఖ సిబ్బంది సంయుక్తంగా గాలింపు జరుపుతున్నామన్నారు. నీలాద్రి అర్బన్ పార్క్ యొక్క సంపూర్ణ పర్యవేక్షణ కొరకు సీసీ కెమెరాల సంఖ్య పెంచుతామని, నీలాద్రి అర్బన్ పార్క్ యొక్క ఆవరణలోని దుప్పుల యొక్క ఆహారం కొరకు గడ్డి మైదానాలు పెంచటం జరుగుతుందని, పార్క్ లోని ముస్లిం గ్రేవ్ యార్డ్ ఎదురుగా ఉన్న గేటును ముస్లింల ప్రార్థనల కొరకు తెరవటం వలన వన్యప్రాణి సంరక్షణకు విఘాతం కలుగుతున్నట్లు గుర్తించి అట్టి గేట్ ను శాశ్వతంగా మూసివేసి ప్రార్థన చేయు సభ్యులను ముస్లిం మత పెద్దలతో మాట్లాడి గుర్తించి వారికి పార్క్ మెయిన్ గేట్ నుండి తగు అనుమతితో ప్రవేశం కల్పించటం జరుగుతుందన్నారు. పార్క్ కి ఉత్తరాన ఉన్న గోడ గడిచిన 10 సంవత్సరాల కాలంలో సింగరేణి సంస్థ చేపట్టిన బ్లాస్టింగ్ కార్యకలాపాల వలన చాలా చోట్ల పగుళ్లు వచ్చి కూలి పోయే ప్రమాదం ఉన్నందు వల్ల త్వరితగతిన గోడ నిర్మాణం యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని,డిస్ట్రిక్ట్ ప్రొటెక్షన్ మీటింగ్ నందు సింగరేణి యాజమాన్యమునకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, గోడ నిర్మాణం పూర్తి అయ్యేవరకు తాత్కాలికంగా గ్రీన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల పరిధిలోని తిమ్మారావుపేట, టిఎల్ పేట నామినేషన్ కేంద్రాలను గురువారం అరిసెలు కలెక్టర్ శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ వేరువేరుగా పరిశీలించారు. నామినేషన్ స్వీకరణ పరిశీలన, ఎన్నికల ప్రక్రియ తదితర వాటి గురించి పలు సూచనలు చేశారు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడి శ్రీదేవి, ఎంపీడీవో భాగ్యశ్రీ, తహసిల్దార్ శేషగిరిరావు, ఎంపీ ఓజివి ఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మున్సిపాలిటీ నందు పని చేస్తున్న మున్సిపల్ కార్మికులు నిత్యం దుమ్ము ధూళి కలిగిన రోడ్లను శుభ్రం చేస్తూ, కాలువలను శుభ్రపరుస్తూ ఇల్లందు పట్టణం వార్డులు పరిశుభ్రంగా ఉండే విధంగా చేస్తుంటారు. ఇలా నిత్యం జరగడంతో మున్సిపల్ కార్మికులు అనారోగ్య సమస్యలకు లోనవుతుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ శ్రీకాంత్ మున్సిపల్ కార్మికుల కోసం ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల నందు హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. పలు వైద్య పరీక్షలను వైద్యులు నిర్వహించి కార్మికులకు టాబ్లెట్లు అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ అంకు షావలి, సానిటరీ ఇన్స్పెక్టర్ ఆర్ఐ శ్రీనివాస్, జవాన్లు, అంజత్, లక్ష్మణ్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి



**ప్రజాపక్షం/కరకగూడెం:** కరరకగూడెం మండల కేంద్రంలో కరకగూడెం లక్ష్మీ దేవి గుడి వద్ద శబరి యాత్రకు 21 మంది అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం అంగరంగ వైభవముగా జరిగింది. ఈ కార్యక్రమము గుమ్మడవెల్లి శ్రీను గురుస్వామి, గుమ్మడవెల్లి కృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో స్వాములు నందిగామ ప్రసాద్ గురు స్వామి, కమలాకర్ గురుస్వామి, సోయం గురుస్వామి, అయ్యప్ప స్వాములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన అబ్జర్వర్



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల కేంద్రంలో మూడవ దశలో జరుగుతున్న నామినేషన్ కేంద్రాలను అబ్జర్వర్ శ్యాంసుందర్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడవ దశలో జరుగుతున్న వేంసూరు, సత్తుపల్లి, కల్లూరు, పెనుబల్లి కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఆయన ఏపీ డి శ్రీదేవిని మండలంలో ఉన్నటువంటి నామినేషన్ కేంద్రాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేటట్లు చూడాలని అన్నారు. నామినేషన్ వివరాలను ఎప్పటికప్పుడు పై అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏడిఏ కిరణ్, ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ, సూపరిండెంట్ కృష్ణ ఉన్నారు.

## ప్రజలు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని టాస్క్‌ఫోర్స్ ఏసీపి సత్యనారాయణ అన్నారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ ఆదేశాలమేరకు ఆయన మండల కేంద్రం కొణిజర్ల, లింగగూడెం గ్రామాలను గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఘర్షణలకు తావులేకుండా గ్రామస్థులందరు సామరస్యంగా ఉండాలని తెలిపారు.

## గ్రాండ్ కిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** హైదరాబాద్‌కు చెందిన షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సారపాకలో గల సీయోను ప్రేయర్ హౌస్ మందిరంలో గురువారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు భక్తి ప్రవక్తలతో నిర్వహించారు. షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మోజెస్ ముళక ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా బూర్గంపాడు, భద్రాచలం, అశ్వాపురం, కరకగూడెం, పినపాక, ఆంధ్రాలోని ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు, అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్‌పురం, కూనవరం, రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలు ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన 150 మంది పాస్టర్లకు క్రిస్మస్ పండుగ సందర్భంగా రూ మూడు లక్షల 82వేల విలువ గలిగిన నూతన వస్త్రాలు, ఆర్థిక సాయం పంపిణీ చేశారు. ఈ ప్రార్థన సమావేశానికి స్థానిక సంఘ కాపరి పాస్టర్ డి పెద్దారావు అధ్యక్షతన వహించారు. ఈకార్యక్రమంలో షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ బృందం రజని మోజస్ అమ్మ, పాస్టర్ సైమన్, బ్రదర్ మోతుకూరి చరణ్, బ్రదర్ స్టీవ్ ఏలియట్ ముకల, బ్రదర్ ఇమ్మానుయేల్, ఆయా మండలాలలో కోఆర్డినేటర్లు డి పెద్దారావు, యాకోబు, టిఎమ్ కుమార్, పాల్ జయప్రకాష్, జోనతాన్, స్టెఫెన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ భూముల ఆక్రమణను అనుమతించవద్దు



**-వైల్డ్ లైఫ్ సంరక్షణకు పటిష్ట చర్యలు**
**-కోతుల సమస్య పరిష్కారానికి కార్యాచరణ**
**-అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని అటవీ భూముల ఆక్రమణకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన అటవీ సంరక్షణ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాలువల నిర్మాణానికి అవసరమైన అటవీ భూముల సేకరణ నిమిత్తం అటవీ శాఖకు ప్రత్యామ్నాయ భూ కేటాయింపు కోసం గిరిజన కార్పోరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న వంద ఎకరాలు బదిలీ చేసేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. భూమిని గుర్తించి 15 రోజులు గడిచినప్పటికీ ఎటువంటి పురోగతి లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పోడు భూముల పట్టా పొందిన కొంత మంది రైతులను మభ్యపెట్టి సమీపంలో ఉన్న అటవీ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుతుందని రెవెన్యూ, అటవీ శాఖాధికారులు అప్రమత్తంగా ఉంటూ ఇంచు అటవీ భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. వైల్డ్ లైఫ్ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అటవీ జంతువులను వేటాడితే రూ. 25వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. పోడు పట్టా ఉన్న వారు ఎవరైనా అడవి జంతువుల వేటకు పాల్పడినా, అటవీ భూములను ఆక్రమించిన గతంలో జారీ చేసిన పట్టా రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీ ప్రాంతంలో పోడు భూములలో 11కెవి లైన్లలో ప్రాధాన్యత క్రమంలో ఇన్సులేట్ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీలాద్రి అర్బన్ పార్కు పక్కన ఉన్న సింగరేణి కాలరీస్ బ్లాస్టింగ్ సమయంలో జింకలు పార్కు కాంపౌండ్ వాల్ దూకి రోడ్లపైకి వచ్చి ప్రమాదాల భారీనపడుతున్నాయని కాంపౌండ్ వాల్ ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీలాద్రి, వెలుగుమట్ల, పులి గుండాల, అర్బన్ పార్కులను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, యువత, పిల్లలను ఆకర్షించేలా పార్కులో జంతువులను ఏర్పాటు చేయాలన్నారు. నైట్ సఫారీ ఏర్పాటు అవకాశాలు పరిశీలించాలన్నారు. గ్రామం నుంచి కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు కోతుల సమస్య ఉందని, రోడ్డుపై కూడా కోతులకు ఆహార పదార్థాలు ఇవ్వవద్దని దీనికి సంబంధించి అవగాహన కార్యక్రమాలు, బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అటవీ శాఖాధికారి సిద్దార్థ్ విక్రం సింగ్ మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసే భూములకు ప్రభుత్వం అందించిన పోడు పట్టాలు ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడానికి వీలు లేదని అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లానుంచి వెట్ ల్యాండ్లను గుర్తించి వాటి సంరక్షణకు నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొదటి విడత చింతకాని మండలంలో తుమ్మల చెరువు వద్ద వెట్ ల్యాండ్ గుర్తించామని దీని సంరక్షణకు నోటిఫికేషన్ సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు విడతలలో జిల్లాలో కనీసం 100 వెట్ ల్యాండ్లను గుర్తించి నోటిఫికేషన్ జారీ చేయాలని , వెట్ ల్యాండ్ వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ వస్తుందన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఈ ఎన్. వెంకటేశ్వర్లు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి, జిల్లా మత్స్య శాఖాధికారి శివప్రసాద్, ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎఫ్ఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేయండి

**-పోలీసు అధికారులకు సిపి ఆదేశం**




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పటిష్ట బందోబస్తు, సమన్వంతో గ్రామ పంచాయతీ ఎన్నికలను విజయవంతం చేయాలని జిల్లా పోలీసు అధికారులకు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్ఓలు, సెక్టార్ అధికారులతో బందోబస్తుపై నిర్వహించిన విడియోకాన్ఫరెన్స్‌లో ఆయన పలు సూచనలు చేశారు. ఎటువంటి ఘర్షణలు, వివాదాలు, ఆరోపణలకు తావు లేకుండా క్షేత్రస్థాయిలో నిశితంగా పర్యవేక్షించాలన్నారు. స్వేచ్ఛయుత వాతవరణంలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు యంత్రంగం పనిచేయాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను ముందస్తుగా బైండవర్లు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలాన్నారు. మద్యం విక్రయాలు, బెల్టు షాపులను కట్టడిచేయడంతో పాటు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈకాన్ఫరేన్స్‌లో ఆయన వెంట అడిషనల్ డిసిపి లా అండ్ ఆడర్ ప్రసాద్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఏసిపి మహేష్, సిఐ రాజిరెడ్డి ఉన్నారు.

# తల్లాడ సర్పంచ్ అభ్యర్థిగా పెరిక నామినేషన్



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ పట్టణానికి చెందిన పెరిక రామారావు బిఆర్ఎస్, టిడిపి, సిపిఎం మద్దతుతో తల్లాడ సర్పంచ్ పదవికి గురువారం నామినేషన్ వేశారు. మిత్రపక్షాలతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేశాడు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు, సిపిఎం నాయకులు గుంటుపల్లి వెంకటయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్, ధూపాటి భద్రరాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు మొక్క కృష్ణార్జున్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జివిఆర్ నాయకులు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, గుండ్ల నాగయ్య, గుండ్ల వెంకటి, దుగ్గుల రాజశేఖర్‌రెడ్డి, కొమ్మినేని సత్యనారాయణ, బొడ్డు మల్లయ్య, అనుమోలు కృష్ణ, మొక్క సత్యనారాయణ, వేమిరెడ్డి నాగిరెడ్డి, కర్నాటి లక్ష్మారెడ్డి, కిషోర్‌రెడ్డి, ముకర దొనేష్, సరికొండ కస్తూరి రాజు, సంఘసాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రావెల్ గుట్ట మాయం

**- నేను చెప్పను : తహశిల్దార్**




**ప్రజాపక్షం/చర్ల :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన గ్రావెల్ గుట్టను గత పదిరోజులుగా భారీ మిషన్లు, టిప్పర్లు, లారీలు ద్వారాబయటకు తరలిస్తున్నారు. జూనియర్ కళాశాల ఆవరణలో గల గ్రావెల్ గుట్టను ఉచితంగా మండలంలోని వివిధ ఇసు క్వారీలకు తరించటం వల్ల ప్రజలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ కాలేజీ ఆస్తిగా ఉన్న గ్రావెల్‌ను ఆదాయంగా మార్చుకుని కళాశాల అభివృద్ధి పనులకు ఉపయోగించకుండా కాలేజీ అధికారులు ఇష్టాను సారంగా బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై కళాశాల ఆఫీస్ ఇంచార్జ్ ను వివరణ కోరగా గ్రావెల్ తవ్వడం, తరలించడం పై తాము 3వ తేది బుధవారం తహశిల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినప్పటికీ ఇసుక కాంట్రాక్టర్లు కళాశాల ఆవరణలో మిషనరీలు, డీజిల్ పీపాలు ఉంచి రాత్రి వేళల్లో అక్రమంగా గ్రావెల్ తోలడానికి సిద్ధపడుతున్నారన్నారు. ఇదే విషయంపై తహశిల్దార్ ఎం శ్రీనివాస్‌ను కాలేజీని నుండి ఏదైనా ఫిర్యాదు వచ్చిందా అని అడగగా, నేను చెప్పను కాలేజీ వారినే అడగండీ వారే చెబుతారు అనే సమాధానం ఇచ్చారు. దీనిని బట్టి చూస్తే ప్రభుత్వ కాలేజీలో ఉన్న గ్రావెల్ గుట్టను అక్రమంగా తరలించడం పట్ల అధికారుల వైఖరి ఏంటో స్పష్టంగా అర్ధమవుతోంది. ఇకనైనా అక్రమంగా గ్రావెల్ తవ్వకం తరలింపు పై జిల్లా కలెక్టర్ దృష్టిపెట్టి అక్రమార్కులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఏకగ్రీవాల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక






**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచ్‌ల ఎన్నిక గురువారం నిర్వహించారు. మండల పరిధిలోని రేగులచలక, మల్లెపల్లి, రాములుతండా, మంగ్యాతండా గ్రామ పంచాయతీలు సర్పంచ్ స్థానంతో పాటు వార్డు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవమయ్యాయి. ఆయా గ్రామ పంచాయతీల్లో ఆర్‌వోల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికైన వారికి పత్రాలు అందజేశారు. అనంతరం ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేగులచలక ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్ తరుపున నున్నా వెంకటేశ్వర్లు, మల్లెపల్లి ఉప సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన బండి వెంకన్న, రాములుతండా ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్‌కు చెందిన గుగులోత్ మానస, మంగ్యాతండా ఉప సర్పంచ్‌గా బిఆర్ఎస్‌కు చెందిన గుగులోత్ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చేతులు ఎత్తే పద్దతిలో ఎన్నిక నిర్వహించారు. బండి వెంకన్న గత ఎన్నికల్లో మల్లెపల్లిలో సర్పంచ్‌గా పనిచేశారు. నున్నా వెంకటేశ్వర్లు గత ఎన్నికల్లో రేగులచలక ఉప సర్పంచ్‌గా పనిచేశారు. మరల ఈ ఎన్నికల్లో కూడా ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యులను అధికారులు, గ్రామస్తులు అభినందించారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల వ్యయంపై అవగాహన సమావేశం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ ఎన్నికల వ్యయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యయ అబ్జర్వ్ పి. లావణ్య, సహాయ రిజిస్ట్రార్ / సహాయ వ్యయ అధికారి కె. అధినారాయణ, ఎన్నికల వ్యయ నోడల్ అధికారి రాజేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ మణుగూరు, ఎస్‌హెచ్ఓ మణుగూరు తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని అన్ని ఆర్‌ఓస్‌స్ ఏఆర్ఓస్, ఎంపిఓ, ఎఫ్ఎస్‌టి టీం, పోటీ చేసే అభ్యర్థులు, వారి ప్రతినిధులు కూడా పూర్తిస్థాయిలో హాజరై సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ అధికారి లావణ్య మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేయగల పరిమితులను రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టంగా నిర్ణయించిందని తెలిపారు. అభ్యర్థి, పార్టీ లేదా మద్దతుదారులు చేసిన ఖర్చులన్నీ అభ్యర్థి పేరుతోనే లెక్కలోకి వస్తాయని చెప్పారు. ప్రతి రోజు ఖర్చులను రిజిస్టర్‌లో నమోదు చేస్తూ, బిల్లులు, రశీదులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన 45 రోజుల్లోపే మొత్తం ఖర్చుల ఖాతా సమర్పించాల్సిన బాధ్యత ఉందని, లేకపోతే పదవి కోల్పోవడం, తదుపరి మూడు సంవత్సరాలు పోటీ చేయలేని పరిస్థితులు ఏర్పడవచ్చని తెలిపారు.స హాయ వ్యయ అధికారి అధినారాయణ వ్యయ పర్యవేక్షణ బృందాల పని ఎలా ఉంటుంది, స్క్రూటిని ఎలా జరుగుతుంది, రికార్డులను ఎలా సిద్ధం చేసుకోవాలో పాల్గొనేవారికి వివరించారు. ఎన్నికల వ్యయ నోడల్ అధికారి రాజేశ్వర్ రెడ్డి మండల స్థాయిలో వ్యయ పరిశీలన, బృందాల సమన్వయం, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలపై వివరించారు. అభ్యర్థులు పారదర్శకంగా అన్ని ఖర్చులను నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్, ఎస్‌హెచ్ఓ మణుగూరు మాట్లాడుతూ నగదు పంపిణీ, మద్యం, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలు పూర్తిగా నిషేధించబడ్డాయని, ఇటువంటి కార్యకలాపాలపై ప్రత్యేక పర్యవేక్షణ జరుగుతుందని పేర్కొన్నారు. పట్టుబడితే వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ రకమైన ఖర్చులన్నీ అభ్యర్థి పేరుతోనే లెక్కలోకి తీసుకుంటారని వివరించారు. ఈ సందర్భంగా ఏడిఈఏ / ఎంపిడిఓ మణుగూరు తరఫున తెలుపుతున్నదేమిటంటే మణుగూరు మండల పరిపాలన ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి, ఏజెంట్, బాధ్యుడికి అవసరమైన మార్గదర్శకత, సాంకేతిక సహాయం అందించడానికి పూర్తిగా సిద్ధంగా ఉందని, అభ్యర్థులు నియమాలు పాటించి, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా ప్రచారం కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు వారు తెలిపారు.

# సర్పంచ్‌గా నిర్మలాకుమారి ప్రమాణస్వీకారం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కెవిఎన్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు సతీమణి, కమ్మ సంఘం కోశాధికారి తుళ్లూరి నిర్మలాకుమారి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. సర్పంచ్‌తో పాటు 10వార్డు స్థానాలు కూడా ఏకగ్రీవం కావడంతో మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్‌చంద్ర, ఆర్‌వో గంటా కృష్ణ, కార్యదర్శి కుమార్ ఆధ్వర్యంలో నియమాక పత్రాలను అందజేశారు. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌గా ఎన్నికైన చట్టు పార్వతి, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నిర్మలా కుమారి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గ్రామస్తులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా ఏకగ్రీవమైన కంద్రిక, సత్యనారాయణపురం గ్రామ సర్పంచ్‌లకు ఎన్నికల అధికారి విజయ్‌చంద్ర, ఆర్‌వో గంటా కృష్ణ ఆధ్వర్యంలో నియమాక పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.